నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | మార్చి 28, 2024 | www.navatelangana.com

షీటీం సేవలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని తాటిగూడ కాలనీలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను షీటీం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా షీటీం విధులు, సైబర్ క్రైమ్, బాల్యవివాహాలు, చట్టాలు తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైన పోకిరీలు అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మాట్లాడినా లేదా ఇబ్బందులకు గురి చేసినా షీటీంను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు సుశీల, సత్యమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికుల ఈఎస్ఐ డబ్బులు జమ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల ఈఎస్ఐ డబ్బులను ఖాతాలలో జమ చేయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టర్‌పై విచారణ జరిపించి తమ వ్యక్తిగత ఈఎస్ఐ ఖాతా డబ్బులను జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, మున్సిపల్ యూనియన్ నాయకులు అగ్గిమల్ల స్వామి ఉన్నారు.



నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ - ఆసిఫాబాద్

నవతెలంగాణ దినపత్రికలో వచ్చిన 'ఏజెన్సీలో నీటి గోస' కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. బుధవారం లింగాపూర్ మండలంలోని మోతిపటార్ గ్రామంలో గ్రామస్తులకు నీళ్ల సరఫరా చేశారు. దీంతో గ్రామస్తులు నవతెలంగాణకు ధన్యవాదాలు తెలిపారు. కొన్ని నెలల నుండి మోతిపటార్ గ్రామంలో నీటి సరఫరా లేదు. మిషన్ భగీరథ ఏఈ రవితేజను ఆధ్వర్యంలో నీటి సరఫరా కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. జైనూర్ మండల కేంద్రంలోని బాలాజీనగర్ కాలనీలో గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పైపులైన్ లీకేజీని పరిశీలించి మరమ్మతులు చేస్తున్నారు.

పల్లెల్లో గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలో గుడుంబా విక్రయించిన, తయారు చేసిన వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ భీమేష్ అన్నారు. బుధవారం మండలంలోని ఫకీర్ నాయక్ తండ, వాయిపెట్, చిమ్మన్ గుడి గ్రామంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు సీఐ భీమేష్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ బలగాలతో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇంటింటా సోదాలు నిర్వహించారు. చిమ్మాన్ గుడి గ్రామంలో 19 లీటర్ల గుడుంబా, 280 లీటర్ల బెల్లం పానకంను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సహకరించాలన్నారు. గ్రామంలో ఎవరైనా గుడుంబాను తయారు చేసి విక్రయిస్తే సమాచారం అందించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నవీన్, పోలీస్ సిబ్బంది నవీన్, అర్జున్ పాల్గొన్నారు.


రైల్వేగేటు ధ్వంసంతో ప్రయాణికుల అవస్థలు



నవతెలంగాణ - సిర్పూర్(టి)

సిర్పూర్, కాగజ్‌నగర్ ప్రధాన రహదారి మార్గంలోని వేంపల్లి రైల్వేగేటు విరిగిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. బొలేరో వాహనం గేటు స్తంభాన్ని మధ్యాహ్నం 12గంటలకు అతివేగంగా ఢీ కొట్టడంతో విరిగిపోయింది. దీంతో సుమారు రెండు గంటల వరకు ఇరువైపులా సుమారు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. ఐదు సంవత్సరాల నుండి చేపడుతున్న ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తిచేస్తే ఇలాంటి ఇబ్బందులు ఉండవని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ రైల్వేగేటును వాహనాలు ఢీ కొట్టిన సంఘటనలు ఉన్నాయి. ఈ రహదారి వెంట తెలంగాణ, మహారాష్ట్రకు భారీ వాహనాలు నడుస్తుంటాయి. అనుమతిలేని వస్తువులను అధికారుల కండ్లు కప్పి అతివేగంగా తీసుకెళ్లే క్రమంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ఎన్నికలు ముగిసే వరకు సహకరించాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

రానున్న పార్లమెంటు ఎన్నికలకు కమిషన్ ఉత్తర్వుల మేరకు ప్రజలు సహకరించాలని, ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. బుధవారం వెంకట్రావ్‌పేట్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలానికి చెందిన గుగులోత్ రాందాస్ తన బొలెరోలో మహారాష్ట్రకు రూ.లక్ష నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. దీనికి సంబంధించిన ఆధారాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు తెలిపారు.

దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని రంజిని గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతూ పట్టుపడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రవీందర్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించగా దేశీదారు సీసాలు పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.3450 ఉంటుంది.



లోక్‌సభ సమరం..నిఘా నిరంతరం..!

- జిల్లాను జల్లెడ పడుతున్న తనిఖీ బృందాలు
- రోజువారీగా పట్టుబడుతున్న మద్యం..డబ్బులు
- ప్రజల్లో ధైర్యం కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్‌లు
- ఎన్నికలకు సమాయత్తమవుతున్న యంత్రాంగం

లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే అధికార యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు ప్రణాళిక రచించింది. అక్రమ మద్యం, డబ్బులు, గంజాయి రవాణా, కానుకలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టిపెట్టింది. జిల్లాతో పాటు అంతరాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి నిరంతరం నిఘా పెడుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నాయి. ఇప్పటికే రెండు కంపెనీల కేంద్ర పోలీసు బృందాలు(సీఏపీఎఫ్) జిల్లాకు చేరుకోగా.. రాష్ట్ర, జిల్లాకు చెందిన పోలీసులు సైతం రోజువారీగా విధుల్లో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా ప్రజల్లో ఓటరు చైతన్యంతో పాటు భయబ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ధైర్యం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా రోజువారీగా ఆయా ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజల్లో ధైర్యం నింపుతూ ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు.



వాహనాల తనిఖీ(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికలకు ఆయా రాజకీయ పార్టీలతో పాటు అధికార యంత్రాంగం సైతం సన్నద్ధమవుతోంది. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం.. ఆయా పార్టీల్లో చేరికలు, ప్రచార వ్యూహాలతో రాజకీయ పార్టీలు బిజీగా ఉండగా.. ఎన్నికల నిర్వహణ.. కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయడం.. ప్రలోభాలను నివారించడం వంటి వాటిపై ఎన్నికల అధికారులు దృష్టిసారించారు. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ మూడు జిల్లాల పరిధిలో ఏడు నియోజకవర్గాలు విస్తరించి ఉండగా మంచిర్యాలలో ఒకటి, రెండు మండలాలు ఈ స్థానం పరిధిలోకి వస్తాయి. మిగితా మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలు పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోకి వస్తాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాల పరిధిలోని అధికారులు, పోలీసు యంత్రాంగం పకడ్బందీ నిఘా ఏర్పాటుచేసింది. ఇప్పటికే కేంద్ర పోలీసు బలగాలు జిల్లాకు చేరుకోగా.. రాష్ట్ర, జిల్లాకు చెందిన పోలీసు బృందాలు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యాయి. మరోపక్క అధికారులు ఎన్నికల క్రతువులో పాల్గొనే ఉద్యోగులు, సిబ్బంది తొలి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేశారు.



ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసుల కవాతు

నిరంతరం నిఘా..!

ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ముందస్తు నివారణకు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే జిల్లాకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలు సమీప మహారాష్ట్ర ఉన్నతాధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటుచేశారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సమన్వయం, భద్రతపై చర్చించినట్లు తెలిసింది. జిల్లాల్లో అంతర్గత చెక్‌పోస్టులతో పాటు అంతరాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి నిరంతరం నిఘా ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో శంకర్‌గూడ, ఆనంద్‌పూర్, పిప్పర్‌వాడ, లక్ష్మీపూర్, ఘన్‌పూర్, కరంజీ ప్రాంతాల్లో అంతరాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటుచేయగా.. ఉట్నూర్, నేరడిగొండల్లో అంతర్గత చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ఇక్కడ పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ అటవీ, ఐటీ అధికారులు ఈ బృందాల్లో ఉన్నారు. ఇక లోక్‌సభ పరిధిలో ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలైన్ బృందాలు నిరంతరం తనిఖీలు చేపడుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే రూ.2లక్షల నగదు, మరో రూ.4.80లక్షల విలువ గల మద్యం బాటిళ్లు పట్టుబడినట్లు అధికారులు చెబుతున్నారు.

ఓటర్లలో ధైర్యం నింపేందుకు జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 18వరకు ఫ్లాగ్ మార్చ్‌లు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఏరులై పారే మద్యాన్ని నియంత్రించడంతో పాటు ప్రలోభాలకు గురిచేసేలా గంజాయి రవాణాతో పాటు డబ్బులు, కానుకల పంపిణీని అడ్డుకునేందుకు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటుచేసింది. ఇప్పటికే పలుచోట్ల బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహిస్తూ వాటిని బంద్ చేయిస్తున్నాయి.

నిరంతరం నిఘా పెడుతున్నాం : గౌస్ ఆలం, ఎస్పీ ఆదిలాబాద్

లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అంతర్ జిల్లాతో పాటు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటుచేశాం. ఓటర్లలో ధైర్యం నింపేందుకు సీఆర్‌పీఎఫ్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నాయి. ఫ్లయింగ్, సర్వేలైన్ బృందాలు నిరంతరం తనిఖీలు చేపడుతున్నాయి. డబ్బులు, మద్యం, గంజాయి రవాణాను పూర్తిగా నిర్మూలిస్తాం. ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.



అధికారులు బాధ్యతతో పని చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన ఎస్పీ, ఐటీడీఏ పీఓ, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో జరిగే పార్లమెంటు ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యతతో పని చేయాలని, వారికి సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్, బోథ్ , నిర్మల్, ముధోల్, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్-టి అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా జనరల్ ఎలక్షన్ లోక్ సభ - 2024 ఎన్నికలకు సంబంధించి కో ఆర్డినేషన్ సమావేశాన్ని ఏఆర్‌ఓస్, ఎస్‌డిపిఓలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 21,11 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. బ్యాలెట్ యూనిట్స్ 2638, కంట్రోల్ యూనిట్స్ 2638, వివి పాట్స్, 2908 మొబైల్ కనెక్టివిటీ 2039 ఉన్నట్లు తెలిపారు. షాడో పోలింగ్ కేంద్రాలు సిర్పూర్ 11, ఆసిఫాబాద్ 28, ఖానాపూర్ 9, ఆదిలాబాద్ 9, బోథ్ 14, నిర్మల్ 1 మొత్తం 72 ఉన్నాయని వెల్లడించారు. పోలింగ్ విధుల కొరకు నియమించిన సిబ్బందికి వచ్చే నెల ఏప్రిల్ 3, 4 తేదీలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు ఫామ్ 12డి కౌంటర్ ఏర్పాటు చేయాలని, ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరు ఫారం 12డి ఉపయోగించుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ప్రతీది దగ్గరుండి పర్యవేక్షించాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో సివిల్ వర్క్స్ ఏమైన ఉంటే ఫిర్యాదు చేయాలని, స్ట్రాంగ్ రూమ్, టేబుల్స్, బందోబస్తు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే సెక్టోరల్ అధికారులకు టీం వైస్‌గా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఆరు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా ఆరు అంతర్రాష్ట్ర, రెండు అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీ నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎటువంటి సిగ్నల్ వ్యవస్థ లేనటువంటి షాడో పోలింగ్ స్టేషన్ ప్రాంతాలను గుర్తించి కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేసేలా విహెచ్ఎఫ్ సెట్లను ఉపయోగించాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్లో , స్ట్రాంగ్ రూమ్‌లలో మూడంచల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల పోలీస్ సిబ్బందితో సమన్వయం కోసం ఇంటర్ స్టేట్ బోర్డింగ్ జిల్లాలతో మీటింగ్‌లు నిర్వహించడం జరిగిందన్నారు. బార్డర్‌లో ఉన్న పోలీస్ సిబ్బందితో ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమాచార వ్యవస్థని పటిష్టం చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో, నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం-ఆసిఫాబాద్ ఆర్డీఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



పాల్గొన్న ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధి అధికారులు

ఎన్నికల సంఘం నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలి



నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గాల వారీగా ఎన్నికల విధులపై ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలలో ప్రతి అధికారి అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ తర్వాత ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు నిర్వర్తించవల్సిన బాధ్యతలను వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, పోలింగ్ రోజున ఉదయం రాజకీయ పార్టీల ఏజెంట్‌ల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించాలన్నారు. ఈవియం, వివిప్యాట్, కంట్రోల్ యూనిట్‌లలో ఏవైన సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత సెక్టోరల్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ సమయం ముగిసేలోపు క్యూలైన్‌లలో ఉన్న ఓటర్లకు టోకెన్లు అందజేయాలని సూచించారు. ఓటర్ స్లిప్‌తో పాటు ఆధార్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి 11 రకాల గుర్తింపు కార్డులను చూపించి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి రెండు గంటలకు పోలింగ్‌కు సంబంధించి రిపోర్టులను విధిగా అందజేయాలని సూచించారు. పోలింగ్ ముగిసిన తర్వాత రిసీవింగ్ కౌంటర్‌లో అధికారులు కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం ఈవీఎం ను కనెక్ట్ చేయడం, ఈవీఎం, మాక్‌పోల్ నిర్వహణ, ఈవీఎంలు సీల్ చేయడం, ప్రత్యేక సందర్భాలు, ఛాలెంజిడ్ ఓట్లు, టెండర్ ఓట్లు, నిబంధన-49 ఎం, 49 ఎంఏ, 49 ఓ, ఏఎస్డీ ఓటర్లు వంటి అంశాలపై మాస్టర్ ట్రైనర్లు బి.శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎ.వేణుగోపాలరావ్, పి.నారాయణవర్మ అధికారులకు శిక్షణ, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, శిక్షణ నోడల్ అధికారి, డిఈఓ రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
2
గురువారం | మార్చి 28, 2024 | www.navatelangana.com

రేపటి నుండి ఉచిత కంప్యూటర్ శిక్షణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ స్టూడెంట్ ఫోరం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 29 నుండి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షులు రాహుల్, ప్రధాన కార్యదర్శి ఇఫ్తార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ఓసియన్ కంప్యూటర్ సహకారంతో ఈ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు శిక్షణను వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7569536323 నంబర్ సంప్రదించాలని సూచించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఈ నెల 28న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంది లక్ష్మారెడ్డి, పడకంటి కిష్టయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, పోలీస్ శాఖ (ఆరోగ్య భద్రత కార్డు కలిగిన వారు) సింగరేణి ఉద్యోగులు, జర్నలిస్టులకు నగదు రహిత శస్త్ర చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు.

నర్సరీపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-నార్నూర్



గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీపై దృష్టి సారించాలి డీఎల్‌పీఓ ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ, క్రిమిటోరియాని పరిశీలించారు. ఎండాకాలం తరుణంలో మొక్కలు ఎండిపోకుండా మొక్కలకు నీరు పోయాలనీ నిర్వాహకులను సూచించారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు. వారి వెంట ఎంపీఓ ఆనంద్, కార్యదర్శి కొల రాజశేఖర్, నర్సరీ నిర్వాహకులున్నారు.

సార్వత్రిక ఎన్నికలు..మారిన రాజకీయ సమీకరణలు

- డీలా పడ్డ బీఆర్ఎస్ • బలం పెంచుకున్న కాంగ్రెస్ • ఓట్లు రాబట్టేందుకు బీజేపీ వ్యూహాలు

నవతెలంగాణ-భైంసా




రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తాజాగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముధోల్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు మారిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పవర్ రామారావు పటేల్ 98,252 ఓట్లు సాధించి, 23099 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి అప్పటి ఎమ్మెల్యే 74253 ఓట్లు సాధించగా, కాంగ్రెస్ అభ్యర్థి బోస్లే నారాయణరావు పటేల్ కేవలం 15588 ఓట్లు సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ హవా ఉన్నప్పటికీ ముధోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓడిపోయింది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అంతకు ముందే బీఆర్ఎస్ క్యాడర్ పెద్ద మొత్తంలో కాంగ్రెస్, బీజేపీలో చేరిపోయింది. అయితే ముధోల్ నియోజకవర్గంలో విఠల్ రెడ్డి చేరికతో కాంగ్రెస్‌కి కొంత బలం చేకూరనుంది. ఇద్దరు ప్రత్యర్థులు నారాయణరావు పటేల్, విఠల్ రెడ్డిలు మిత్రులుగా మారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన నిలువనున్నారు. ఇక బీఆర్ఎస్ క్యాడర్ పూర్తిస్థాయిలో ఖాళీ కావడంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీలో చేరిన రమాదేవి, సీనియర్ నాయకులు విలాస్ గాదేవార్ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో క్యాడర్ తుడుచుకు పోవడం ఆ పార్టీకి పెద్ద మైనస్ అని చెప్పవచ్చు. అసలే గెలుపు ఉత్సవంతో ముందున్న బీజేపీ మరోసారి పార్లమెంట్ ఎన్నికల్లో తన సత్తా చాటడానికి రెడీ అవుతుంది. ఎమ్మెల్యే రామారావు పటేల్ ఎన్నికల్లో విజయం సాధించినప్పటి నుండి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేయించడంతో పాటు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. దీంతో కార్యకర్తల్లో మరింత జోష్ పెరిగింది. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడెం నగేష్ ఇప్పటికే కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించి ఆయన ప్రచారంలో ముందున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ముధోల్ నియోజకవర్గంలో బీజేపీకి భారీ మెజార్టీ వచ్చింది. 100 రోజుల్లోనే గత ఫలితాల నేపథ్యంలో ముధోల్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు తారుమారయ్యాయి.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు..!

- లీకేజీల నివారణకు కృషి • అవసరం 30 ఎంఎల్‌డీ • అందిస్తున్నది 24 ఎంఎల్‌డీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ పట్టణ ముఖచిత్రం

ఎండకాలం ప్రారంభమైన నేపథ్యంలో మున్సిపల్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా పురపాలక శాఖ చర్యలు చేపడుతుంది. అందులో భాగంగానే వీలిన వార్డులు, గత సంవత్సరం నీటి సమస్య ఎదుర్కొన్న కాలనీల్లో నీటి ఎద్దడి లేకుండా మున్సిపల్ అధికారులు ప్రణాళికలు చేశారు. లీకేజీలను నివారించడంతో పాటు కాలనీల్లో ఉన్న పరిస్థితులను తెలుసుకుంటు ప్రణాళికలు సిద్ధం చేస్తు దానికి అనుగుణంగా పనులు చేపడుతున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో నీటి సమస్యనే ప్రధాన ఎజెండాగా తీసుకున్నారు. నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దానికి అనుగుణంగానే చర్యలు చేపడుతున్నారు.

పరిష్కారానికి సిద్ధమైన మున్సిపల్ యంత్రాంగం

పట్టణానికి 30 ఎంఎల్‌డీ నీరు ప్రతి రోజు అవసరమవుతుంది. ప్రస్తుతం 24 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. క్రమం తప్పకుండా నీటిని అందిస్తున్న ఇబ్బందులు తప్పడం లేదనే ఆరోపణలున్నాయి. వేసవిలోని ఏప్రిల్, మే నెలలో సమస్యల మరింత తీవ్రం అవుతాయనే ఆలోచనతో మున్సిపల్ యంత్రాంగం సన్నద్ధమైంది. ఎక్కడ కూడా నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఇంజనీరింగ్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. కమిషనర్ సైతం నీటి సరఫరాపై అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలు చేస్తున్నారు.



ఆదిలాబాద్ పట్టణం

నీటి సమస్యలు రాకుండా చర్యలు

-ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ ఆదిలాబాద్.

ప్రస్తుతం పట్టణంలో 24 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నాం. నీటి సమస్యను అధిగమించేందుకు ఇప్పటికే ఆయా కాలనీలో బోర్‌వెల్ మెటీరియల్స్, ఇంటర్ కనెక్షన్లను ఏర్పాటు చేస్తున్నాం. వారం రోజుల్లో ఆ పనులు కూడా పూర్తి అవుతాయి. అవసరమున్న ఆరో ఎంఎల్‌డీని మిషన్ భగీరథ ద్వారా అందించేల చర్యలు తీసుకుంటున్నాం. అక్కడక్కడ ఉన్న లీకేజీల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తున్నాం.



ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- ఎస్పీ డా. జి.జానకి షర్మిల



నవతెలంగాణ-నిర్మల్

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఎస్పీ డా. జి.జానకి షర్మిల ఆదేశించారు. బుధవారం సోన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని ఆదేశించారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు తెలియజేశాలన్నారు. ఆర్థిక, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం రిసెప్షన్, టెక్నికల్ రూంలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పోలీస్ సిబ్బంది విధులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సోన్ ఎస్సై సంతోషం రవీందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుగూడలో పోలీసుల కవాతు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని గురువారం రాబోయే ఎన్నికల దృష్ట్యా రణదివేనగర్, బంగారి గూడ కాలనీలలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ సీఐ కె ఫనిధర్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు ధైర్యం కల్పించేలా కవాతు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముజాహిద్, సిఆర్పీఎఫ్ ఇన్స్‌పెక్టర్ సూరజ్, కవాతు బృందం పాల్గొన్నారు.



ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఉపాధి హామీని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని టెక్నికల్ అసిస్టెంట్ లత అన్నారు. బుధవారం మండలంలోని లింగోజితండా గ్రామపంచాయతీ ఎక్స్ రోడ్డు గ్రామంలో కూలీలు పనులు చేస్తున్నారు. పనులను లత పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు లేని కూలీలు తమ పేర్లు నమోదు చేసుకొని జాబ్ కార్డు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, కూలీలున్నారు.



జాతీయ జెండా ప్రతిష్టతను కాపాడాలి

- కలెక్టర్‌కు బీఆర్ఎస్ నాయకుని వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ జెండాను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ అన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఇంటింటా ఎగరేసిన జాతీయ జెండాలు చినిగిపోతున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని కోరుతూ బుధవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందచేశారు. పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతి ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేయడం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ జెండాలను తొలగించకపోవడంతో చినిగిపోతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. ఇందుకు కలెక్టర్ స్పందించి త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విజ్జగిరి నారాయణ మాట్లాడుతూ ఆజదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఇంటింటా ఎగరేసిన జాతీయ జెండాలను ఇప్పటికీ తీసివేయలేదన్నారు. ప్రస్తుతం అవి చినిగిపోతున్నాయని పేర్కొన్నారు. జెండా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఆర్అండ్‌బీ వద్ద ఏర్పాటు చేసిన భారీ జాతీయ జెండాను సైతం ప్రస్తుతం తొలగించారని, వెంటనే జెండాను ఏర్పాటు చేయాలనీ కోరినట్లు వివరించారు. ఈ విషయాలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంతోష్, ఉదయ్ కిరణ్, గెడ్డం రాము, రాజు, మర్సకోల బాపూరావు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా వికలాంగుల నిరుద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈ విషయమై బుధవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సదరం శిబిరంలో సరైన వైద్యం అందించాలన్నారు. 5 శాతం రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలు కేటాయించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సలీం, ప్రధాన కార్యదర్శి సురేష్, సుకుమార్ ఉన్నారు.

ఉపాధి పనులకు కూలీలను పెంచాలి



నవతెలంగాణ-తాంసి

జాతీయ ఉపాధి హామీ పనులకు కూలీలను పెంచాలని ఎంపీడీఓ గడ్డం మోహన్ రెడ్డి ఉపాధి టీఏలకు సూచించారు. బుధవారం మండలంలోని కప్పర్ల, జామిడీ, గ్రామ పంచాయతీ గ్రామాలలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, నర్సరీ మొక్కలను పరిశీలించారు. ఈ సందరంగా కూలీలకు పలు సూచనలు చేస్తూ కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటం కారణంగా కూలీలు ఉదయం తొందరగా పనులు ముగించుకొని వెళ్లాలన్నారు. పనుల ప్రదేశంలో తాగునీరు, టెంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కూలీ పనులకు వచ్చిన వారు మాస్టర్లలో సంతకాలు చేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అవకతవకలకు పాల్పడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రాజు ఉన్నారు.

ఆదిలాబాద్ మట్టి కుండలకు భలే ఆదరణ

- కుండల వైపు మొగ్గు చూపుతున్న జనాలు • ప్రభుత్వం గుర్తించాలని కుమ్మరుల వేడుకోలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎండకాలం వచ్చిందంటే చాలు.. ఆదిలాబాద్ రంజన్లు, కుండలు ఎక్కడ అమ్ముతున్నారో తెలుసుకొని మరీ కొనుగోలుచేస్తున్నారు. ఎందుకంటే రంజన్ నీళ్లు తాగితే ఆ మజాయే వేరు. పేదోడి ఫ్రిజ్ అని చెప్పుకునే వీటికి మంచి డిమాండ్ ఉంది. నీటిని చల్లగా ఉంచడంతో పాటు చూడటానికి కూడా అందంగా ఉండడంతో వీటికి మంచి ఆదరణ లభిస్తుంది. మట్టితో తయారు చేస్తారు కనుక ఇందులోని నీటిలో ఔషధ గుణాలుంటాయి. ఇది ఆరోగ్యానికి చాలా మంచిదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. దీని తయారీలో నాణ్యత కలిగిన బంకమట్టిని సేకరించి పొడిగా కలుపుతారు. నీళ్లతో తడిపిన మిశ్రమాన్ని అలాగే కొద్ది రోజుల పాటు ఉంచుతారు. తర్వాత గుర్రపు లద్దీ కలిపి రంజన్లను చేతితో తయారు చేసి ఆరబెడుతారు. అలా ఓ క్రమపద్ధతిలో పేర్చి మంటల్లో కాలుస్తారు. బహిరంగ మార్కెట్లో రూ.130 నుంచి రూ.300 వరకు సైజును బట్టి రేట్లు ఉన్నాయి.

మన కుండాలకు ఇతర ప్రాంతాల్లో డిమాండ్..

జిల్లాలో ఆదిలాబాద్‌రూరల్ మండలం బంగారుగూడ, ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త, పాత కుమ్మరివాడ, ఉట్నూర్ సమీపంలోని కుమ్మరికుంట, సిరికొండ, బేల, తదితర ప్రాంతాల్లో వేసవి కాలంలో కుమ్మరులు రంజన్లు, కుండలు తయారు చేస్తారు. ఇక్కడ తయారు చేస్తున్న రంజన్లు, కుండలు ప్రముఖ నగరాలకు కూడా తీసుకెళ్తారు. ఆదిలాబాద్ రంజన్లకు, కుండలకు ఇతర రాష్ట్రాల్లోనూ గిరాకీ గతంలో ఉండేది.

ఆరోగ్యపరంగా మట్టికుండలే మేలు

మట్టితో తయారు చేసే రంజన్లలోని నీళ్లు తాగేందుకు పేదలతో పాటు వైద్య పరిజ్ఞానం ఉన్న ప్రతి ఒక్కరూ వేసవిలో మట్టికుండల్లోని, రంజన్లలోని నీటిని తాగేందుకే ఆసక్తి కనబరుస్తారు. మట్టితో తయారు చేసిన కుండలు, రంజన్లలోని నీళ్లను తాగితే ఆరోగ్యపరంగా మంచి ఫలితాలు ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు చేతువృత్తుల వారిని ఆదుకోవడంలో విఫలం చెందుతున్నాయని కుమ్మరి కులస్తులు వాపోతున్నారు.

కష్టమైన ఇష్టంగా చేస్తూ వృత్తిని కాపాడుతున్నాం..

ఇదిలా ఉంటే ఏండ్లుగా రంజన్లను తయారు చేస్తున్న తమను ప్రభుత్వాలు గుర్తించడం లేదని పలువురు కుమ్మరీ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తయారీ సమయంలో నడుము వంగిపోతుందన్నారు. పెరిగిన ధరలతో వృత్తిని కొనసాగించలేక పోతున్నామన్నారు. వృత్తిని కాపాడాలనే లక్ష్యంతోనే ఎంత భారమైన రంజన్లను తయారు చేస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ఆదిలాబాద్ రంజన్లకు పెట్టింది పేరని, కానీ ఇక్కడి కుమ్మరులను మాత్రం ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.





దత్తాత్రేయ ఆలయంలో ఏలేటి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పార్‌పెల్లి గ్రామంలోని దత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్మల్ నియోజకవర్గ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో వార్షికోత్సవ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మెంగు అనిల్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



పనులను పరిశీలించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని కన్నర్‌గావ్ బీటీ రోడ్డు, వంతెన పనులను బుధవారం జెడ్పీటీసీ అజయ్‌కుమార్ పరిశీలించారు. పనుల్లో పూర్తిగా నాణ్యత లోపించిందని, సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారు ఇష్టం వచ్చినట్టు పనులు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం సంబంధిత ఆర్‌అండ్‌బీ ఈఈ ఫోన్‌లో మాట్లాడి పనులు దగ్గరుండి నాణ్యతతో పనులు జరిగేలా చేయాలని సూచించారు. చాలా రోజుల తర్వాత పనులు చేపడుతున్న నాణ్యత లేకపోతే చెడిపోతాయని, తక్షణమే సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులున్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

3

కుమురంభీం ఆసిఫాబాద్

గురువారం | మార్చి 28, 2024 | www.navatelangana.com

ఆశ్రమ పాఠశాల హెచ్ఎం, వార్డెన్ సస్పెన్షన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బియ్యం తరలించి అమ్మడానికి ప్రయత్నించిన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం, వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. రెండు రోజుల క్రితం మండలంలోని పాట్నాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో రాత్రి సమయంలో ట్రాలీ ఆటోలో బియ్యం ఎక్కించి అమ్మడానికి తీసుకెళ్తుండగా బాలికలు అడ్డుకున్నారు. ఈ ఘటనపై ఐటీడీఏ పీఓ స్పందించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ పరశురాం, వార్డెన్‌ను సస్పెండ్ చేసినట్టు ఏటీడబ్ల్యుఓ పురుషోత్తం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బియ్యాన్ని అమ్మడానికి యత్నించిన ఘటనపై పీఓ ఆదేశాల మేరకు డీడీ, ఏటీడబ్ల్యుఓ విచారణ చేపట్టారు. వారి నివేదిక ప్రకారం పీఓ ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా అక్కడ పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడు భీంరావుకు బాధ్యతలు అప్పగించినట్టు ఏటీడబ్ల్యుఓ తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ క్రమంలో అవసరమైన అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులకు ఆదేశించారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 37 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఏప్రిల్ 1న కొనుగోలు ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందన్నారు. వరి ధాన్యం విక్రయించేందుకు కేంద్రాలకు వచ్చే రైతుల సౌకర్యార్థం నీడ, నీరు ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. గన్నీ సంచులు సమకూర్చడంతో పాటు టార్పాలిన్లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ, వ్యవసాయ విస్తరణ అధికారులతో పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ధాన్యం తూకం జరిగిన వెంటనే మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపట్టమని తెలిపారు. రైతులు నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లలో నమోదు చేసే విధంగా పర్యవేక్షించాలని, విక్రయ సంబంధిత నగదును రైతుల ఖాతాలలో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 15లోగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు మధ్య దళారీలను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

నవతెలంగాణ - సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు గడువును పెంచినట్టు డీసీఓ పోలోజు బాలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిదో తరగతి సంవత్సరంలో సీట్ల భర్తీకి 21 వరకు ఉన్న గడువును అనివార్య కారణాల వల్ల 31 వరకు పొడిగించినట్టు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 21న ఉంటుందన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ - ఆసిఫాబాద్

లింగాపూర్ మండలంలోని నడ్డంగూడ గ్రామానికి చెందిన జాదవ్ విలాస్‌పై కేసు నమోదైనట్టు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అనుమతి లేకుండా అధిక ధరలకు మద్యం అమ్ముతున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు మద్యం దుకాణాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. పోలీసులు దాడి చేస్తున్న సందర్భంలో దుర్భాషలాడి దౌర్జన్యానికి దిగాడని తెలిపారు. విలాస్‌పై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్టు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమతులు లేకుండా మద్యం దుకాణాలను నడిపిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

కిరాణ దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలకేంద్రంలోని పలు కిరాణ దుకాణాల్లో బుధవారం లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు చేశారు. బుధవారం బస్టాండు ఏరియాలోని పలు కిరాణ దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. రెండు దుకాణాల్లో 25 కిలోల బియ్యం సంచిలో ఒక కిలో వంద గ్రాములు తక్కువగా వచ్చాయి. రెండు దుకాణాల యజమానులపై కేసు నమోదుచేసి రూ.15 వేలు జరిమానా విధించినట్టు అధికారులు తెలిపారు. తూకాలు తక్కువగా వేసి ప్రజలను మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వ్యాపారస్తులను హెచ్చరించారు.

అడవిలో అగ్నిప్రమాదాలకు టోల్‌ఫ్రీ నెంబర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అడవిలో ఏర్పడే అగ్ని ప్రమాదాల సమాచారం అటవీ అధికారులకు అందించడానికి టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాచారం అందించడానికి 18004255364 లేదా 9803338666 నెంబర్లు 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు.

సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులలో సాధారణ ప్రసవాలు జరిగేలా అధికారులు, వైద్యులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత జిల్లాగా మార్చడంలో భాగంగా జిల్లాలో చేపట్టిన పోలియో కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పని చేసి నిర్దేశిత లక్ష్యం 100 శాతం పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో వైద్యాధికారులు వారి పరిధిలోని ఆస్పత్రులలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గిరిజన ప్రాంతాలలో ప్రజలతో మమేకమై స్నేహపూర్వక వాతావరణంలో వైద్య సేవలు, చికిత్సలు అందించాలని, అంగన్‌వాడి, ఆశ కార్యకర్తల సమన్వయంతో వైద్యాధికారులు గర్భిణులకు అందించే పౌష్టికాహారంతో పాటు మహిళలకు ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇచ్చేలా వివరించాలని తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు, లక్ష్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి తగు సూచనలు సలహాలు అందించారు. గ్రామ పంచాయతీల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో గర్భం దాల్చిన మహిళలు తమ వివరాలను నమోదు చేసుకుని సమయానుసారంగా అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ క్రమంలో అంగన్‌వాడీ, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో తమ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి గర్భిణులకు వివరాలు సేకరించాలన్నారు. గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం అందించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేసేలా పర్యవేక్షించాలని, గర్భిణీలకు సాధారణ ప్రసవాలు జరిగేందుకు ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రతి నెల 5వ తేదీన సమావేశం ఏర్పాటు చేసుకొని చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించుకోవాలన్నారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా పిల్లల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, తక్కువ, అతి తక్కువ ఎదుగుదల గల పిల్లలను గుర్తించి వారిని మామూలు పిల్లల స్థితికి తీసుకువచ్చేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని దహెగాం మండలం గిన్నెధరి, కౌటాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతి మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని, వేసవి కాలం అయినందున గ్రామాల పరిధిలోని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మార్చి నుండి జూన్ వరకు వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా ట్యాంకర్లు, బోర్ వెల్స్, మిషన్ భగీరథ సంబంధిత పైపులైన్ల మరమ్మతులు చేపట్టి తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఓ భాస్కర్, డీఎల్పీఓ ఉమర్ హుస్సేన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రమంగా ముదురుతున్న ఎండలు

- ఉక్కపోతతో జనం విలవిల



నవతెలంగాణ-బెజ్జూరు

వేసవికాలం ప్రారంభంలోనే ఎండ తీవ్రత దినదినం పెరగడంతో ఉక్కపోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి మూడు గంటల సమయంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో ఈ సమయంలో ఇంటి నుండి బయటకు రావడానికి జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ఆ సమయాల్లో గ్రామాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనబడుతున్నాయి. వేసవి తాపం నుండి ఉపశమనం కోసం కూలర్లను ఉపయోగిస్తున్నారు. ఎలక్ట్రికల్ దుకాణాల్లో కూలర్ల అమ్మకాలు జోరందుకున్నాయి. కూలర్ల విక్రయాలు ఎక్కువ కావడంతో వాటి ధరలు దినదినం పెరుగుతున్నాయి. ఎండ తీవ్రతను తట్టుకోవడానికి గొడుగులు, క్యాప్‌లు, చల్లని వాటిని ఉపయోగిస్తున్నారు. మైదాన ప్రాంతంలో ఎండలు తీవ్రతరమవుతున్నాయి. ఐదు రోజుల పాటు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు అప్రమత్తమవుతున్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే సమయాల్లో ఇంటిలో నుండి బయటకు రాకుండా కూలర్ల వద్ద ఉంటున్నారు. బుధవారం 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ఎండ వేడికి తాళలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న పిల్లలు మధ్యాహ్నం సమయంలో బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వేసవి తాపం నుండి తట్టుకోవడానికి ప్రభుత్వ పాఠశాల్లో ఒంటిపూట బడులను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. ముందు జాగ్రత్తలు తీసుకోవడానికి చల్లని పానియాలపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. దీంతో కూల్‌డ్రింక్స్, పండ్ల రసాల విక్రయాలు జోరందుకున్నాయి.

పోషకాహార లోపం లేని సమాజానికి కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోషకాహార లోపం లేని సమాజం కోసం కృషి చేయాలని, అందుకు అవసరమైన పౌష్టికాహారాన్ని పిల్లలకు అందజేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్వాడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని తొలగించడానికి అంగన్‌వాడీలతో పాటు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. 0-6 సంవత్సరాల వయసు ఎంతో ముఖ్యమైనదని, ఈ సమయంలో పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాల్సి ఉంటుందన్నారు. బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. చిన్ననాటి నుండే లింగ బేధాలు తెలియకుండా నిజ జీవితంలో వాటికి చూపించకుండా పిల్లలను పెంచాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు అందించే గొప్ప సంపద పౌష్టికాహారం, విద్య మాత్రమేనని అన్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పౌష్టికాహార లోపం నివారణ కోసం చర్యలు తీసుకోవాలని, దీనికి ప్రభుత్వం నుండి కావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందుతాయన్నారు. అనంతరం పిల్లలకు చేపట్టిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. పోషణ



పక్వాడ్ సందర్భంగా పిల్లలు చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం చిన్నపిల్లల తల్లులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ సీడీపీఓలు సాదియా, సురేఖ, అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఫ్లై ఓవర్ పనులు

- 'నవతెలంగాణ' కథనానికి స్పందన
- తీరనున్న కష్టాలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాగజ్‌నగర్, సిర్పూర్ మార్గమధ్యలో ఉన్న వేంపల్లి గేటు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వంతెన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ వంతెన నిర్మాణ పనులు సుమారు ఏడు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటివరకు ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రయాణీకులు పడుతున్న ఇబ్బందులపై 'నవతెలంగాణ' ఈనెల 4న ఫ్లై ఓవర్ కష్టాలు తీరేనా అనే కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు పనులను ప్రారంభించారు. ప్రస్తుతం శరవేగంగా పనులు కొనసాగుతున్నాయి. ఈ మార్గం నుండి బెజ్జూరు, చింతలమానెపెల్లి, కౌటాల, సిర్పూర్ నుండి నిత్యం కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌కు రాకపోకలకు ఇక మార్గం సుగమం కానుంది. త్వరలో పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.



ఫ్లై ఓవర్ పనులు చేస్తున్న అధికారులు


ఫ్లై ఓవర్ బాధలు తీరేనా..?

ఈనెల 4న నవతెలంగాణలో ప్రచురితమైన కథనం

మున్సిపాలిటీ అభివృద్ధికి పటిష్ట చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు ప్రజల సమన్వయంతో పటిష్టమైన చర్యలు తీసుకోనున్నట్లు రీజనల్ డైరెక్టర్(ఆర్‌డీ) మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాహిద్ మసూద్ అన్నారు. నూతన మున్సిపాలిటీ సందర్శించి రికార్డులు తనిఖీ చేసి అనంతరం కమిషనర్ భుజంగరావుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మున్సిపాలిటీ భవనం కోసం ఉన్నతాధికారులకు వివరించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రజల సహాయ సహకారాలు తీసుకోనున్నట్లు వివరించారు. మున్సిపాలిటీలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈ మధు అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ దేవాలయం వీధిలోని శివాలయంలో ఈనెల 25న పూజలు చేస్తున్న పూజారి సాయిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీఏఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ శర్మ, జిల్లా అధ్యక్షుడు శిరీష్ శర్మ ఒక ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో భక్తుల సమక్షంలో దాడి చేయడం దారుణమని, నిందితులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేస్తామని ప్రకటనలో హెచ్చరించారు.

విద్యుత్ లైన్‌ల కింద మంటలు పెట్టొద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతుల వారివారి చేనులలో మిగిలిపోయిన పత్తి కట్టెలు ఇతర చెత్త తగలబెట్టే సందర్భంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వేసిన 400 కెవి విద్యుత్ లైన్‌ల కింద మంటలు పెట్టొద్దని కార్పొరేషన్ ఇంజనీర్ గౌతమ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, దహెగాం, కాగజ్‌నగర్, రెబ్బెన, సిర్పూర్(టి), వాంకిడి మండలాల్లో విద్యుత్ లైన్లు ఉన్నాయని రైతులు గమనించాలన్నారు. వీటి కింద మంటలు పెడితే విద్యుత్ సరఫరా ఆగిపోవడమే కాకుండా, ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

రూ.1.30 లక్షలు పట్టివేత



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా సరైన ఆధారాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.1.30 లక్షలు పట్టుకున్నారు. మహారాష్ట్రకు చెందిన రాంబరె చంద్రవుట్ తన కారులో రూ.1.30 లక్షలు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్టు ఎస్సై సాగర్ తెలిపారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ పోశెట్టి, ఉల్లాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసుకున్న ఎస్సీ నిరుద్యోగ యువతకు ప్రభుత్వ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు బీఎస్ఆర్బీ, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్, ఎస్సై, కానిస్టేబుల్ కోసం మూడు నెలల పాటు అందించే ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28లోగా కాగజ్‌నగర్‌లోని సాయి తేజ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు సంక్షేమ వసతి గృహాధికారి దేవాజి సెల్ నంబర్ 9985274060, చందన 8247299217 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

నవతెలంగాణ-బెజ్జూరు

బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దండె విఠల్ కోరారు. బుధవారం మండలకేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. సమావేశాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక కార్యకర్త పనిచేయాలని సూచించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి ఒక కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. బీఆర్ఎస్ పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. కాగజ్‌నగర్‌లో జరిగే విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సామల రాజన్న, రాజేష్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

బీఎంపీ ఎంపీ అభ్యర్థిగా భూక్య రాజు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బహుజన ముక్తి పార్టీ(బీఎంపీ) ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా భూక్య రాజును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్ ప్రకటన విడుదల చేశారు. ఎంపీ అభ్యర్థులుగా ప్రకటించిన భుక్యా రాజు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు తెలిపారు. మొదటి లిస్టులో ఎంపికైన ఐదుగురిలో తనకు చోటు కల్పించడం సంతోషంగా ఉందని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొ.ధర్మయ్య, రాష్ట్ర కార్యదర్శి ఫయూముద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. నరేందర్ పవార్, స్టేట్ సెక్రటరీ మహమ్మద్ అన్సారీ పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని మండల పంచాయతీ అధికారి ఎస్.రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని పోన్కల్, మొర్రిగూడ, టీజీపల్లి గ్రామాల శివారుల్లో ఉన్న ప్రభుత్వ నర్సరీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీలలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా నీరు పోసి కాపాడాలని నర్సరీ నిర్వాహకులను ఆదేశించారు. హరిత హారానికి మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. పోన్కల్ ఈఓ రాహుల్ పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలలోని ఐఎన్‌టీయూసీ నాయకులు సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో సింగరేణిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గురువారం హైదరాబాద్‌కు వెళుతున్నట్లు తెలిపారు. అలాగే సంబంధిత శాఖల మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, బట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, సింగరేణి సి అండ్ ఎండి బలరాంను కలిసి సమస్యలపై వినతి పత్రాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. నూతన బొగ్గు గనులు, బొగ్గు గనుల ప్రయివేటీకరణ ఆపడం, కార్మికులకు సొంతింటి పథకం కింద 250 గజాల స్థలాన్ని, రూ.25 లక్షల వడ్డీ లేని రుణం, ఆదాయ పన్ను రద్దు, ఏరియా ఆస్పత్రులలో సూపర్ స్పెషాలిటీ ఏర్పాటు అదేవిధంగా పలు రకాల సమస్యలపై మంత్రులను, సింగరేణి అధికారులను కలుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు భీమ్ రావు, కలవేన శ్యామ్, భీమ్ రవి, నర్సింగ్, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

ఖరీఫ్ సీఎంఆర్ సకాలంలో పూర్తి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



జిల్లాలో ఖరీఫ్ సంబంధిత సీఎంఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్‌తో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లుల యజమానులతో సీఎంఆర్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సంబంధిత వరిధాన్యం సీఎంఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, మర పట్టించిన ధాన్యాన్ని సీఎంఆర్ డెలివరీస్ కింద భారత ఆహార సంస్థకు ఇవ్వవలసిన ధాన్యాన్ని సకాలంలో అందించాలని తెలిపారు. జిల్లాలో మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా కేటాయించిన ధాన్యాన్ని తప్పనిసరిగా మిల్లింగ్ చేసి సకాలంలో అందించాలని తెలిపారు. జిల్లా రోజువారి మిల్లింగ్ సామర్థ్యం 1 వేయి 864 మెట్రిక్ టన్నులు కలిగి ఉందని, ఈ ప్రకారంగా 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఖరీఫ్ సీఎంఆర్‌ను రోజు వారిగా నిర్దేశించిన ప్రకారం డెలివరీ చేయాలని తెలిపారు. గన్నీ సంచులను అవసరం మేరకు సమకూర్చడం జరిగిందని, మిల్లింగ్ చేసిన నాణ్యమైన ధాన్యాన్ని అందించాలని, వచ్చే రబీ కొరకు గోదాములను సిద్ధం చేయాలని తెలిపారు. ధాన్యం మిల్లింగ్ చేయలేని రైస్‌మిల్లు యజమానులు నిబంధనల మేరకు ఇతర మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని తెలిపారు. జిల్లాలో రైతుల వద్ద నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, వేసవి అయినందున రైతుల సౌకర్యార్థం తాగునీరు, నీడ, గన్నీ సంచులు, టార్పాలిన్లు ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందని, నిబంధనల ప్రకారం తప్ప, తాలు, తేమ శాతం ఇతర అంశాలను పరిశీలించి రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్, రైస్ మిల్లుల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్మాసు కాంతయ్య, రైస్ మిల్లుల యజమానులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-నస్పూర్



లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం రౌడీషీటర్లలో మార్పు తేవాలని రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ కౌన్సిలింగ్ నిర్వహించారు. నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, ఉద్యోగ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలని, హుందాగా జీవించాలని సూచించారు. నేరస్తుల తొందరపాటులో నేరాలు చేసినా వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులలో ఇన్వెస్టిగేషన్ జరుగుతుందని నేరస్థులు ఎవరూ చట్టం నుంచి తప్పించుకోలేరని అన్నారు. ఏ నేరం చేసినా పోలీసులు గుర్తిస్తారు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. నేరం చేసే ముందు, రౌడీ షీటర్లు కుటుంబాలు, పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలని అన్నారు. నేరాల నియంత్రణలో మీరు భాగస్వామ్యులు కావాలన్నారు. రౌడీ షీటర్ ఉన్న ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక బృందాల ద్వారా ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భూ కబ్జాలు, ప్రజలను భయపెట్టడం, ఆస్తుల ధ్వంసం వంటి చట్ట విరుద్ధ పనులకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. గత పది సంవత్సరాల నుంచి ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్ప్రవర్తన కలిగి ఉండి పూర్తిగా మారితే రౌడీ షీట్ ఎత్తివేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్ ఐపీఎస్, మంచిర్యాల పట్టణ ఇన్స్‌పెక్టర్ బన్సీలాల్, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నరేష్ కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

నర్వ-మిట్టపల్లి రోడ్డు పునరుద్ధరించండి



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని నర్వ-మిట్టపల్లి గ్రామాల మధ్యన ఉన్న రోడ్డును పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఫార్మేషన్ రోడ్డుగా నిర్మించి వదిలేసిన రోడ్డును బీటీ రోడ్డుగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు. పది సంవత్సరాల క్రితం రోడ్డు ఫార్మేన్ జరిగినా ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడం బాధాకరమని పేర్కొంటున్నారు. అదేవిధంగా జాతీయ రహదారి 363 నుండి నర్వ గ్రామ వరకు గల బీటీ రోడ్డు చెడిపోవడంతో వాహణాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని గ్రామానికి చెందిన పొట్టాల నాగరాజు అన్నారు. జాతీయ రహదారికి కేవలం కిలో మీటరు దూరంలో ఉన్న నర్వ రోడ్డు పటిష్టపర్చడంతో పాటు నర్వ నుండి మిట్టపల్లి గ్రామం వరకు గల ఫార్మేషన్ రోడ్డును బీటి రోడ్డుగా తీర్చిదిద్దాలని కోరారు. రోడ్డు నిర్మాణాలు పూర్తి చేస్తే మిట్టపల్లి గ్రామస్థులు నాలుగు కిలో మీటర్ల ప్రయాణంతో మండల కేంద్రానికి చేరుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. రోడ్డు సౌకర్యం సరిగ్గా లేని కారణంగా మిట్టపల్లి గ్రామస్థులు ముదిగుంట, రసూల్‌పల్లి మీదుగా 10 కిలో మీటర్లు ప్రయాణించి మండల కేంద్రానికి చేరుకోవల్సి వస్తోందని తెలిపారు. మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు పర్చడం కోసం అధికారులు తగు విధంగా స్పందించాలని, నర్వ-మిట్టపల్లి మధ్య రోడ్డు పునరుద్దరిస్తూ నర్వ రోడ్డు పటిష్టపర్చాలని ఈ సందర్భంగా గ్రామస్థులు అభ్యర్థిస్తున్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-జైపూర్



ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ, కోల్ వేజ్‌బోర్డు సభ్యులు జనక్ ప్రసాద్‌ను సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. రాష్ట్ర కనీస వేతన సలహా మండలి కార్పోరేషన్ ఛైర్మెన్‌గా ఎంపికైన సంధర్బంగా సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌తో కలిసి సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జనక్ ప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సంధర్బంగా సింగరేణి ఉద్యోగులు సమస్యలు, కోల్‌మైన్స్ పెన్షన్-1998 సవరించి కనీస పెన్షన్ రూ.15 వేలకు పెంచడానికి కృషి చేయాలని కోరారు. పెన్షన్ పథకంలో నిబంధన ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి సమీక్షించి కరువు భత్యంతో కూడిన పెన్షన్ చెల్లించాలని కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ (సీపీఆర్ఎంఎస్) స్కీం కార్డు ద్వార అపరిమిత వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న విశ్రాంత ఉద్యోగులకు ఉచితంగా ఔట్ పేషంట్ వైద్యంకు ప్రత్యేక వైద్య విభాగం ఏర్పాటు చేయాలని, వివిధ ఏరియాల్లో ఖాలీగా ఉన్న క్వాటర్స్‌లలో విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాలని, విశ్రాంత ఉద్యోగుల మెడికల్ కార్డ్స్ దేశ వ్యాప్తంగా అపరిమిత వైద్య సేవలు అన్ని ఆస్పత్రుల్లో చెల్లుబాటు అయ్యేవిధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అదేవిదంగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే వృద్దాప్య పించన్ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు వర్తింపజేయడం, తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయడం, తదితర విషయాలపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో పాటు సింగరేణి యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జనక్ ప్రసాద్‌ను కలిసిన వారిలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆళవందార్ వేణుమాదవ్, బీరయ్య, వెంకటరమణ, ప్రభాకర్ రావు, సత్యనారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, ఐఆర్‌కే రావు, మాధవరెడ్డి, సత్యలింగం, చంద్రమౌళిఉన్నారు.

పిల్లల్లో పోషకాహార లోపాలను అధిగమించాలి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల సంరక్షణలో భాగంగా పోషకాహార లోపాలను అధిగమించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా సంక్షేమశాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సీడీపీఓలు, సమన్వయకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సంక్షేమం, సంరక్షణకు కృషి చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో న్యూట్రీ గార్డెన్లను ఏర్పాటు చేసి పిల్లలలో పోషకాహార లోపాలను అధిగమించేలా బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సలహాలతో ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు, ఎత్తు, కొలతలు, ఎదుగుదల, మానసిక స్థితిగతులను ఎల్లప్పుడూ పర్యవేక్షించాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని తెలిపారు. ఈ క్రమంలో అంగన్‌వాడీ సిబ్బందికి న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు ద్వారా నాణ్యమైన కూరగాయల పెంపకంలో పాటించవలసిన మెళకువలపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వివరించాలని, న్యూట్రీ గార్డెన్ పెంపకంపై ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్య, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సమన్వయకర్త డా.కోట శివకృష్ణ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

వేసవికాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ బి.రాహుల్‌తో కలిసి మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమీషనర్లతో తాగునీటి సరఫరా నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా ప్రతి ఇంటికి తాగునీరు అందేలా కార్యచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీలను గుర్తించి 5 రోజులలోగా మరమ్మత్తులను పూర్తి చేయాలని, పైప్‌లైన్ల లీకేజీలపై ఏప్రిల్ 10వ తేదీ వరకు ప్రతి రోజు మున్సిపల్ కమీషనర్లు, మిషన్ భగీరథ ఏఈలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించడం జరుగుతుందని, వారి పరిధిలోని పైప్‌లైన్లలీకేజీలు, ఇతర తాగునీటి సంబంధిత సమస్యలను గుర్తించి తెలియజేయాలని తెలిపారు. నీటి సరఫరా సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వారికి ముందుగా సమాచారం అందించి నీటిని సరఫరా చేసి అనంతరం మరమ్మత్తు చర్యలు చేపట్టాలని, చేతిపంపులు, నల్లా కనెక్షన్ల ద్వారా నీటి సరఫరాకు అవకాశం లేని ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న నీటి ట్యాంకర్లను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇంటింటికీ తాగు నీరు అందాలి

- అదనపు కలెక్టర్ బి.రాహుల్



నవతెలంగాణ-నస్పూర్

వేసవికాలం తాగు నీటి సమస్యల లేకుండా ప్రతి ఇంటికి తాగు నీరు అందేలా కార్యచరణ రూపొందించాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ జి.వెంకటేశం, డివిజినల్ పంచాయతీ అధికారి ధర్మరాణితో కలిసి చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని 5 మండలాల మిషన్ భగీరథ డీఈ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా చేయాలని, వేసవికాలం అయినందున తాగునీటి సరఫరా చేయలేని మారుమూల గ్రామాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ పైప్లైన్ల లీకేజీలు, బోర్వెల్ల మరమ్మత్తులు చేపట్టి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాలన్ని ఆకస్మిక తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. పాఠకులకు, విద్యార్థులకు, పోటీ పరీక్షలను సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, పత్రికలు, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ పాలకులను ఆదేశించారు. పోటీ పరీక్షలకు అభ్యర్థులను ప్రోత్సహించేలా ప్రభుత్వం సౌకర్యాలు కల్పించడం జరిగిందని, వీటిని సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో మొక్కలు నాటేందుకు నిర్ణయించిన లక్ష్యం మేకరు నర్సరీలలో మొక్కలను సిద్దం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్‌లతో కలిసి నర్సరీల నిర్వాహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కలు నాటేందుకు నిర్ణయించిన లక్ష్యాలకు అనుగుణంగా నర్సరీలలో సీడ్ జర్మినేషన్ అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నూతన సీడ్ జర్మినేషన్ చేపట్టాలని తెలిపారు. మొక్కల సంరక్షణకు షేడ్ నెట్స్ ద్వారా నీడ, నీటి సౌకర్యాలు కల్పించాలని, వేసవికాలం అయినందున సకాలంలో నీటిని అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అటవీ బీట్ అధికారులు తమ పరిధిలోని గ్రామపంచాయతీలలో గల నర్సరీలను సందర్శించి మొక్కల ఎదుగుదల, ఇతరత్రా అంశాలను పంచాయతీ కార్యదర్శి వద్ద గల రిజిస్టర్ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ శాఖలు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల వారిగా కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి స్థాయిలో సిద్ధం చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అటవీ బీట్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

ఓసి, ఆర్కే-7 గనిని తనిఖీ చేసిన డైరెక్టర్



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఉపరితల గని, ఆర్కే-7 గనిని డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు నాలుగు రోజుల దూరంలో ఉన్నామని, ఉద్యోగులందరూ రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను సాధించాలని, ఉత్పత్తి సాధించే క్రమంలో ప్రతి ఒక్క ఉద్యోగి అధికారి రక్షణను మరువద్దని తెలిపారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో సీఆర్ఆర్, జీవీఆర్ కాంట్రాక్టర్ కంపెనీ ప్రతినిధులతో ఈ నాలుగు రోజుల్లో తీయవలసిన ఓబి ఉత్పత్తి లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని ఓబి ఎంత ఎక్కువ తీస్తే బొగ్గు అంతా ఎక్కువ ఉత్పత్తి రవాణా చేయడానికి అవకాశం ఉంటుందని సంబంధిత ఓబీ కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులకు సూచించారు. అలాగే ఆర్కే-7 గనిలో రెండవ సీమ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు. భూగర్భ గనులలో పని చేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా రక్షణను రక్షణ నియమాలు పాటిస్తూ వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరిస్తూ తమకు నిర్దేశించిన పనులను చేయవలెనని సూచించారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల రక్షణకు ప్రాధాన్యమిస్తుందని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క ఉద్యోగి, అధికారి తమకు నిర్దేశించిన విధులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం వి పురుషోత్తమ రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ అధికారి టి శ్రీనివాస్, ఆర్కే-7 గ్రూపు ఇన్‌చార్జి ఏజెంట్ ఏవీ రెడ్డి, శ్రీరాంపూర్ ఉపరితల గని మేనేజర్ బ్రహ్మజీ, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, ఆర్కే-7 గని మేనేజర్ శ్రీధర్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, సర్వే అధికారి సంపత్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | మార్చి 28, 2024 | www.navatelangana.com

సాంఘిక, ట్రైబల్ సంక్షేమ గురుకులాలలో దరఖాస్తులకు స్వీకరణ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ, ట్రైబల్ సంక్షేమ గురుకులాల సంస్థ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు టీఎస్ డబ్ల్యూఆర్ ఈఐఎస్ జగిత్యాల జిల్లా సమన్వయాధికారి పి. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విద్యాలయాల్లో ఉత్తమ విద్యతో పాటు బ్రైటర్ మైండ్స్‌కు, చదువులో వెనకబడిన వారికి వేరు వేరుగా ప్రత్యేక శిక్షణ నివ్వడమే కాకుండా ఆ మ్యూజిక్ క్రీడలు, కెరీర్ గైడెన్సు మొదలగువాటిలో నైపుణ్యం గుర్తించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను తలదన్నే రీతిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గురుకుల విద్యనందిస్తున్న పాఠశాలల్లో చేర్పించి మీ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు దోహదం చేయాలని సూచించారు. అల్లునూర్‌లోని సీవోఈలో 9 వ తరగతిలోకి మాత్రమే రెగ్యులర్ అడ్మిషన్లు ఉన్నట్లు తెలిపారు.

రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-పెద్దపల్లి

ఉపాధ్యాయుల శ్రేయస్సు, విద్యా, సామాజిక పరమైన అంశాలపై నిరంతరం కృషి చేయడానికి, ఉపాధ్యాయులలో ఐక్యతను పెంపొందించుడంలో భాగంగా పెద్దపల్లి రెసిడెన్స్ టీచర్స్ అసోసియేషన్ ఏర్పడిందని పలువురు ఉపాధ్యాయ నాయకులు అన్నారు. బుధవారం పెద్దపల్లి రెసిడెన్స్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి, జిల్లా సీనియర్ ప్రధానోపాధ్యాయుడు హనుమంతు నూతన జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా సాదుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా కేతిపెల్లి మహేందర్‌రెడ్డి, టి.రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా వేగోళం సత్యనారాయణ, ఆర్థిక కార్యదర్శిగా కర్రె ప్రవీణ్, మీడియా కన్వీనరుగా ఎలుగం కనకయ్య, కార్యవర్గ సభ్యులుగా కేతిపెల్లి కిషన్ రెడ్డి, కర్రె రాజు, సంది సంపత్‌రెడ్డి, మునగంటి ఫణిందర్, మెతుకు తిరుపతి, ముఖ్య సలహాదారుగా చాట్ల ఆగయ్య ఎన్నికయ్యారు.

గ్రామ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని రామారావుపేట్ గ్రామ పంచాయతి అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని గ్రామస్తులు కోరారు. బుధవారం ఇందారం ఓపెన్‌కాస్ట్ గనిని సంధర్శించిన సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు మాజీ ఎంపీటీసీ ముదాం రమేష్, మాజీ సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతిలతో కలిసి గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. రెండు వైపుల గల ఓపెన్‌కాస్ట్ గనుల నుంచి వెలువడే దుమ్ము భారీ పేలుళ్లతో ఏర్పడుతున్న శబ్ద కాలుష్యంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని తెలిపారు. ఓపెన్‌కాస్ట్ గనుల అవసరాలు, విస్తరణ పనుల విషయమై గ్రామ పంచాయతీ వరకు గల రహదారులు ఎక్కడకక్కడ కట్ చేయడం ద్వార గ్రామాన్ని విడిచి ఎటువెల్లాలన్నా ప్రయాణ భారం ఏర్పడుతున్న తీరును గుర్తించాలని కోరారు. ప్రధానంగా ఇందారం-రామారావుపేట్ మధ్యన చెరువు కట్ట మీదుగా నిర్మించిన రోడ్డు పొడవు లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఇందారం ఓసీ దంపు విషయమై కట్ చేసిన రోడ్డు, ఇందారం ఫ్లైఓవ్ నుండి రామారావుపేట్ పాత రోడ్డు శ్రీరాంపూర్ ఓసీ చెక్‌పోస్టు వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కోరారు. అదేవిధంగా సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులతో గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటర్నల్‌గా సీసీ రోడ్లు నిర్మించాలని, నీటి వసతి కల్పించడం కోసం బోరు బావులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఓసీ దుమ్ము నుండి ఉపశమనం కల్గించేందకు వాటర్ స్ప్రే, గ్రామస్తులకు ఓబీలలో ఉద్యోగావకాశాలు, దోబీ ఘాట్స్ నిర్మించాలని వినతీ పత్రం పేర్కొన్నారు. గ్రామస్థుల అభ్యర్దన పట్ల సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ వెంకటేశ్వర్లు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు సరైన గైడెన్స్ అందించాలి

నవతెలంగాణ-పెద్దపల్లి

సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థులకు సరైన గైడెన్స్ అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమ్మర్ క్యాంప్ వాలంటీర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలిసి పాల్గొన్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ..రాబోయే వేసవి సెలవులలో జిల్లాలోని 100 గ్రామాలలో 3 నుంచి 5వ తరగతి చదివే విద్యార్థుల కోసం తెలంగాణ ఎడ్యుకేషన్ లీడర్ షిప్ కలెక్టివ్ ఆధ్వర్యంలో భారత్ దేఖో టీమ్ ద్వారా ప్రత్యేక సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి 11 వరకు సమ్మర్ క్యాంప్ ఉంటుందని అన్నారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొని విద్యార్థుల జీవితంలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థులకు మంచి అంశాలను నేర్పాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు సమ్మర్ క్యాంపులో రిజిస్టర్ చేసుకునే విధంగా ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు సమన్వయం చేయాలని సూచించారు. 63 మంది వాలంటీర్లకు సమ్మర్ క్యాంప్ నిర్వహణ పట్ల శిక్షణ అందించామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ అధికారి డాక్టర్ పీఎం షేక్, భారత్ దేఖో టీమ్ సభ్యులు, ఎంఈఓలు, టీచర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో టోకెన్లు జారీ చేయాలి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన తరువాత ఇన్‌చార్జిల సాయంతో వారికి టోకెన్లు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో యాసంగి 2023-24కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ.. యాసంగి 2023-24 సీజన్‌లో జిల్లాలో 118824 హెక్టర్లలో వరిసాగు చేయగా, దీనికి గాను 565241 మెట్రిక్స్‌ల వరి ధాన్యం కొనుగోలు కోసం ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ యాసంగి సీజన్‌లో వరి ధరలు గ్రేడ్ ఎ-2203, కామన్ ధరలు 2183గా నిర్ణయించినట్టు తెలిపారు. ఈ సీజన్‌కు గాను ఐకేపీ 133, ప్యాక్స్ - 282, మెప్మా - 1 మొత్తం 416 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని, ప్రతి కొనుగోలు కేంద్రంలో 2 ప్యాడి క్లీనింగ్ మెషిన్స్ అందుబాటులో ఉంచాలని, టోకెన్ పద్ధతి పాటించాలని, రైతులకు సరిపడు టార్పాలిన్ కవర్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏ రోజుకు ఆ రోజు ఎఫ్ ఏ క్యూ చెక్ చేసి రికార్డు చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలలో ఫ్యాక్ నిబంధనలు పాటించాలని, కేంద్రాలలో అధిక తూకం వేయకూడదని, కేవలం బస్తాకు 40.650 కేజీలు తూకం వేయాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులైన నీడ, తాగునీరు, తాత్కాలిక టాయిలెట్స్‌ను సమకూర్చుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్, ఆన్‌లైన్ వసతి ఉండాలని, ప్రతి ఒక్క అధికారి క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. రైస్ మిల్లర్లు కానీ, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు కానీ ఫేక్ ట్రక్ చిట్ ద్వారా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన 3 రోజులలో రైతులకు ఖాతాలో డబ్బులు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ యాసంగిలో 62 బాయిల్డ్ మిల్లులు పాల్గొంటున్నందున ప్రతి రైస్ మిల్లులో 50-60 హమాలీలను సమకూర్చుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు మిల్లుకు వచ్చిన లారీని త్వరితగతిన దిగుమతి చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలతో లేకపోతే సంబంధిత పౌరసరఫరా క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. రైతులకు ముందుగానే నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే విధంగా తగు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఏఈఓలకు కేటాయించిన కొనుగోలు కేంద్రాలను సందర్శించి నాణ్యమైన ధాన్యం సర్టిఫై చేయాలన్నారు. రాబోయే కాలంలో పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహనా కల్పించాలని, తెగులు నివారణ మార్గాలు రైతులకు తెలుపాలన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, పలువురు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయంలో తలంబ్రాల కార్యక్రమం

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి అధికారుల నివాసం బంగ్లాస్ ఏరియాలోని దుర్గామాత ఆలయంలో ఆర్జీ 1 లేడిస్ క్లబ్ ఆధ్వర్యంలో భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానంలో జరుగనున్న శ్రీ సీతా రాముల కల్యాణ మహోత్సవం కోసం వడ్లను గోటితో వొలిచే తలంబ్రాల బియ్యం కార్యక్రమాన్ని లేడీస్ క్లబ్ ఏరియా అధ్యక్షురాలు చింతల లక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వడ్లను వొలిచిన అనంతరం వాటిని శ్రీరామా నామం ఆకతి వచ్చునట్లు పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సెక్రటరీ చిలుక లక్ష్మి, సభ్యులు మాలతి, నిర్మల, సుధా, స్వరూప, నీరజ, రోజా, బీనా, సుజాత, సావిత్రి, రమ, లలిత, సువర్ణ తదితరులున్నారు.

నేడు కాగజ్‌నగర్‌కు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

- బీఆర్ఎస్ నాయకునిగా తొలిసారి రాక
- అడ్డుకుంటామంటున్న బహుజన నాయకులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేడు కాగజ్‌నగర్‌కు రానున్నారు. బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షునిగా సుపరిచితుడైన ఆర్ఎస్‌పి ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెల్సిందే. బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత తొలిసారిగా ఆయన కాగజ్‌నగర్ వస్తుండడంతో బీఎస్‌పీ శ్రేణుల స్పందనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు, గత అసెంబ్లీ ఎన్నికల సిర్పూరు నియోజవర్గ బీఎస్‌పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎవరూ ఊహించని విధంగా బీఆర్ఎస్‌లో చేరి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. ఇది రాష్ట్రంలోనే చర్చకు దారి తీసింది. ముఖ్యంగా సిర్పూరు నియోజకవర్గానికి ఆర్ఎస్‌పి సుపరిచితులు కావడంతో ఇక్కడి బహుజన నాయకులకు ఆయన నిర్ణయం షాక్‌ను కలిగించింది. ఆర్ఎస్‌పీ బీఆర్ఎస్‌లో చేరడంతోనే ఇక్కడి బహుజన సమాజ్ పార్టీ నాయకులు తలో దిక్కు పయనమయ్యారు. ఎన్నికలు ముగియగానే బీఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అర్షద్ హుస్సేన్ ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. తర్వాత బీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్పీ ఛైర్మన్ సిడం గణపతి ఆర్ఎస్‌పీ నిర్ణయాన్ని బహిరంగంగానే వ్యతిరేకించి పార్టీలో ఉండాలా లేదా అనేది త్వరలోనే ప్రకటిస్తానని తెలిపారు. నియోజకవర్గంలో బీఎస్‌పీ బలోపేతానికి నమ్మకంగా పని చేసిన ఆ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు దుర్గం ప్రవీణ్‌కుమార్ కూడా ఆ పార్టీకి రాజీనామా చేశారు. వీరితో పాటు అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన పలువురు మున్సిపల్ కౌన్సిలర్‌లు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులంతా ప్రస్తుతం ఎటూ నిర్ణయం తీసుకోలేక సతమతమవుతున్నారు.

బీఆర్ఎస్‌లో చేరేవారు ఎవరు ?

గురువారం కాగజ్‌నగర్‌లోని సంతోష్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ సమావేశంలో ఆర్ఎస్‌పీతో పాటు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్త, ఎమ్మెల్సీ దండె విఠల్‌లు హాజరు కానున్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఈ సమావేశానికి తీసుకువచ్చి ఆయన వర్గీయులను పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేర్పించుకోవాలనేది ఆ పార్టీ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పార్టీని వీడిన తర్వాత సిర్పూరులో పార్టీ పూర్తిగా బలహీనమైంది. ఆర్ఎస్‌పీతో మళ్లీ పునరుత్తేజం పొందాలని పార్టీ భావిస్తున్నా, ఆర్ఎస్‌పీని నమ్మి ఎంతమంది బీఆర్ఎస్‌లో చేరుతారనేది ఇక్కడ సందేహంగా మారింది. మొదటి సారి సిర్పూరు నుండి బీఎస్‌పీ పక్షాన పోటీ చేసిన సమయంలో ఆయన ప్రజల మన్ననలు పొందారు. ముఖ్యంగా ఇక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆగడాలను ఆర్ఎస్‌పీ ఎండగట్టి ప్రజల మన్ననలు పొందారు. ఓడినా, గెలిచినా తాను ఇక్కడే ప్రజల పక్షాన ఉండి పోరాడుతానని చెప్పి, స్థానికంగా ఇల్లు కూడా తీసుకున్నారు. దీనితో ప్రజలు నమ్మి ఆయనకు 44 వేల పైచిలుకు ఓట్లు వేశారు. ఎన్నికల అనంతరం ఆయన తీసుకున్న నిర్ణయాన్ని బహుజనులు బహిరంగంగానే వ్యతిరేకిస్తుండడంతో గురువారం ఆయనతో పాటు బీఆర్ఎస్‌లో చేరే నాయకులు ఎవరనే విషయంలో సందిగ్దత నెలకొంది.

అడ్డుకుంటామని సోషల్‌మీడియాలో ప్రచారం

ఆర్ఎస్‌పీని అడ్డుకుంటామని అంబేద్కర్-పూలే విద్యార్థి జేఏసీ నాయకుడు దుర్గం వినోద్ పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగింది. ఆర్ఎస్‌పీ తన స్వార్థ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం కేసీఆర్‌తో చీకటి ఒప్పందం చేసుకునే రాజకీయాల్లోకి ప్రవేశించాడని ఆరోపించారు. ఆర్ఎస్‌పీ నియోజకవర్గ ప్రజలకు క్షమాపణ చెప్పకుండా ఇక్కడికి రావద్దని, మున్ముందు జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

ఆర్ఎస్‌పీని కలిసే ప్రసక్తే లేదు

సిడాం గణపతి, మాజీ జెడ్పీ ఛైర్మన్



బీఎస్‌పీ అభ్యర్థిగా పోటీ చేసి బీఆర్ఎస్ విధానాలను ఎండగట్టిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, ఎట్టి పరిస్థితులలో ఆయనను మేము కలిసే ప్రసక్తే లేదని బీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్పీ ఛైర్మన్ సిడం గణపతి స్పష్టం చేశారు. ఆయన 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ ఆర్ఎస్‌పీని నమ్మి మోసపోయామని, ఇపుడు మళ్లీ నమ్మి మోసపోయేది లేదని ఆయన అన్నారు. తాను తన వర్గీయులు ఇప్పటికీ బీఎస్‌పీలోనే కొనసాగుతున్నారని, తమ నిర్ణయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

ఉపాధి హామీ కూలీలకు వెంటనే బిల్లులను చెల్లించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఉపాధి హామీ కూలీలకు వెంటనే బిల్లులను చెల్లించాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్ సింగ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రాంజీ గోండ్ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలం నుండి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఉపాధి హామీలో పని చేసే కూలీలకు సరైన వేతనం ఇవ్వకుండా కాలయాపన చేస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మొత్తం విడుదల చేసి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వేసవికాలంలో పనిచేసే ప్రాంతంలో నీడకు టెంట్లు వేయాల్సిన బాధ్యత ఉండగా ఆ దిశగా చర్యలు లేవన్నారు. పని ప్రాంతంలో మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, చిన్నపిల్లలకు ఆయాలను ఏర్పాటు చేయాలని, కనీస వేతన చట్టం ప్రకారం రోజుకు రూ. 600 వేతనం చెల్లించాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయడానికి బడ్జెట్ పెంచాలన్నారు. రాబోవు రోజుల్లో తీవ్రంగా ఎండలు ఉన్న ప్రాంతాలలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడం సాయికుమార్, వినోద్ కుమార్, రేణుక, వనిత, లక్ష్మిబాయి, రుక్మాబాయి, అంజలి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత క్షమాపణలు చెప్పాలి

నవతెలంగాణ-పెద్దపల్లి

నేతకాని సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు గుమ్మడి కుమ్మరస్వామి వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గొల్లె రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మీడియాతో రాజ్ కుమార్ మాట్లాడుతూ..నేతకాని జాతికి నీతి, జాతి లేదంటూ తమ ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే విధంగా కాంగ్రెస్ నాయకుడు మాట్లాడటం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ జాతి సామాజిక ఉద్యమాలలో, పోరాటాలలో ఉందన్నారు. నేతకానికి స్వతహాగా సంస్కృతి, సంప్రదాయం ఉందని, అది తెలియని కుమారస్వామి పిచ్చిపిచ్చిగా మాట్లాడటం అతని అవివేకానికి నిదర్శనమని దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఒక్క ఓటు కూడా వేయవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. వంశీని ఘోరంగా ఓడిస్తామని స్పష్టం చేశారు. వివేక్ వెంకటస్వామి రాసిచ్చిన స్క్రిప్టునే కుమారస్వామి చదివి విని పించాడని ఆరోపించారు. వివేక్ కుటుంబం ఎన్నో ఏళ్లుగా నేతకాని ఓట్లు దండుకొని, రాజకీయ దోపిడీ చేశారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో నేతకాని సామాజిక వర్గం అధికంగా ఉన్నారని వారికి సముచిత స్థానం ఇస్తామని చెప్పి కాంగ్రెస్‌కి ఎన్నో ఏళ్లుగా సేవలందించిన గోమాస శ్రీనివాస్‌కి టికెట్ ఇవ్వకుండా పారాషుట్‌గా వచ్చిన వివేక్ వెంకట్ స్వామికి చెన్నూరు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చి, ఇప్పుడు అతని కుమారుడు గడ్డం వంశీకృష్ణకి ఎంపీగా టికెట్ ఇవ్వడం సిగ్గుచేటని రాజ్ కుమార్ విమర్శించారు. ఈ సమావేశంలో గ్రామ అధ్యక్షుడు పైడి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి మంచినీళ్ల లింగయ్య, ముడి మడుగుల రాజేశం, మంచినీళ్ల బాబునాథ్, మంచినీళ్ల తిరుపతి, జాడి పోచయ్య, తాటుకూరి మధుకర్, జాడి ప్రవళిక, మంచినీళ్ల అనిల్, మంచినీళ్ల శివలింగయ్య, మంచినీళ్ల లక్ష్మయ్య, మంచినీళ్ల రాజయ్య, మంచినీళ్ల తిరుపతి, చంద్రశేఖర్, మద్రాస్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్‌కు సన్మానం

నవతెలంగాణ-గోదావరిఖని

ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్‌ను సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బుధవారం సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్బంగా ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్, కోల్ వేజ్‌బోర్డు సభ్యులు బి.జనక్ ప్రసాద్‌కు శాలువాలు కప్పి, పూలబొకే అందజేసిన ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలైన కోల్ మైన్స్ పెన్షన్ 1998 సవరించి కనీస పెన్షన్ 15వేల రూపాయలు చెల్లించాలని, పెన్షన్ పథకంలోని నిబంధన ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి సమీక్షించి కరువు భత్యంతో కూడిన పెన్షన్ చెల్లించాలని, కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ (సిపిఆర్ఎంఎస్) స్కీం కార్డ్ ద్వారా అపరిమిత వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, లాంటి పరిసర ప్రాంతాల్లో నివసించే విశ్రాంత ఉద్యోగులకు ఉచితంగా ఔట్ పేషంట్ వైద్యం కోసం ప్రత్యేక వైద్య విభాగం ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వాసుదేవ్ రావ్, ఎ.బుచ్చిప్రసాద్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఆర్.సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.బాబురావు, ఏనుగు రవీందర్ రెడ్డి, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ పాల్గొన్నారు.

రామగుండంలో అభివృద్ధి పేరుతో విధ్వంసం

- క్వార్టర్ల కూల్చివేత ఆలోచన అవివేకం
- 70 ఏండ్లుగా ఉన్న ఇండ్లపై దుర్మార్గపు ఆలోచనలు
- రోడ్డు వెడల్పు పేరుతో క్వార్టర్ల కబ్జా సహించేది లేదు
- క్వార్టర్ల కూల్చివేతను ఆర్జీ 1 జీఎం విరమించుకోవాలి
- ట్రేడ్ యూనియన్ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని

గోదావరిఖని పట్టణ కేంద్రంలో అధికార యంత్రాంగం రోడ్డు వెడల్పు, అభివృద్ధి పనుల పేరుతో సామాజిక విధ్వంసానికి పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సింగరేణికి చెందిన పలు ట్రేడ్ యూనియన్ నాయకులు ధ్వజమెత్తారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో 72 సింగరేణి క్వార్టర్ల తొలగింపు నోటీసులు అందుకున్న బాధిత సింగరేణి కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సింగరేణికి చెందిన పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని వారికి సంఘీ భావం తెలిపారు. ఈ సందర్బంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ రోడ్డు వెడల్పులకు పట్టణాభివృద్ధికి తాము సహకరిస్తామని, జన నివాస ప్రాంతాలైన సింగరేణికి క్వార్టర్లను తొలగించాలనే దుశ్చర్యలను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని సంయుక్తంగా ప్రకటించారు. ఎలాంటి అధికారిక ఉత్తర్వులు, సర్క్యూలర్లు లేకుండా చట్ట విరుద్ధంగా కూల్చివేతల లాంటి విధ్వంస కాండలకు పాలకుల మద్దతుతో అధికార యంత్రాంగం దురభ్యాసాలకు పూనుకున్న విధం ఖండ నియమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సింగరేణి ఆర్జీ 1 జీఎం 72 క్వార్టర్ల తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకుని కార్మిక హక్కులను, ప్రయోజనాలను రక్షించాలని, లేని పక్షంలో ఐక్య కార్మిక పోరాటాలను నిర్మించి తిప్పికొడతామని పేర్కొన్నారు. భారత పార్లమెంటు ఎన్నికల వేళ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గోదావరిఖనిలో ఎలాంటి ప్రారంభోత్సవాలు, శంకు స్థాపనలకు అనుమతి లేకున్నా రామగుండం ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడలతో, కాంగ్రెస్ నాయకులను ఉసిగొల్పుతూ అనధికారికంగా మున్సిపల్ మేయర్, కమిషనర్‌లను చంకలో పెట్టుకుని కూల్చివేత లాంటి భారీ విధ్వంసకాండలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే క్వార్టర్ల కూల్చివేత నిర్ణయాన్ని ఆర్జీ 1 జీఎం ఉపసంహారించుకుని అక్రమ పద్ధతులను మానుకోవాలని కార్మిక సంఘ నాయకులు హెచ్చరించారు. సమావేశంలో జాతీయ కార్మిక సంఘాలైన సీఐటీయూ నుండి తుమ్మల రాజా రెడ్డి, హెచ్ఎంఎస్ నుండి జక్కుల నారాయణ, బిఎంఎస్ నుండి ఆకుల హరిన్, ఐఎఫ్‌టియూ నుంచి కృష్ణ, నరేష్, నాయకులు తోట వేణు, నంబయ్య, రామ స్వామి, దేవయ్య, జెర్సన్ రాజు, మాజీ కార్పొరేటర్ తోట అనసూర్య, కనకమ్మ, సరిత తదితరులు ఉన్నారు.

సమాజంలో రౌడీగా కాదు.. పిల్లలకు మంచి తండ్రిలా ఉండండి

- భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మారండి
- రౌడీషీటర్లకు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-గోదావరిఖని:

సమాజంలో రౌడీగా కాదు.. పిల్లలకు మంచి తండ్రిలా ఉండాలని రౌడీషీటర్లకు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ కౌన్సెలింగ్ ఇచ్చారు. గోదావరిఖనిలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ పెద్దపల్లి జిల్లాలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో రౌడీ షీటర్స్ మార్పులో భాగంగా మానవీయ కోణంలో రౌడీ షీటర్స్ మార్పు కోసం కౌన్సెలింగ్ నిర్వహించి, ఒక అవకాశం ఇస్తున్నామని పోలీస్ కమిషనర్ తెలిపారు. నేర జీవితం వీడి ప్రస్తుత సమాజంతో మంచి జీవితం గడుపుతూ హుందాగా జీవించాలని, నేరస్తులు తొందర పాటులో నేరాలు చేసినా సరే తప్పు చేయని వారి కుటుంబం కూడా దాని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతుందని తెలిపారు. రౌడీ షీటర్స్ తన పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మార్పు తెచ్చుకోవాలని, రౌడీ షీటర్ అనే ఓ పదం తమ బిడ్డల భవిష్యత్ కూడా నాశనం చేస్తుందని గుర్తు చేశారు. మీ పిల్లలకు ఓ మంచి తల్లిదండ్రులుగా ఉండండి. హీరోగా మిగిలిపోండి అని సీపీ తెలిపారు. నేర ప్రవృతిలో మార్పు రాకపోతే చట్టపరంగా చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరి కదలికలు, చర్యలు మాకు తెలిసిపోతాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలోనే కాకుండా భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్రువర్తంతో ఉండాలని, ఇలాంటి ప్రలోభాలకు గురై నేరాలకు పాల్పడకుండా, అదేవిధంగా ఎవరైనా నేరాలు పాల్పడినప్పుడు నేరాలు జరగకుండా నియంత్రణలో క్రైమ్ స్టాఫర్స్‌గా ఉండాలని తెలిపారు. భూ కబ్జాలు, ప్రజలను భయపెట్టడం, ఆస్తుల ధ్వంసం వంటి చట్ట విరుద్ధ పనులకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. నేరప్రవత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. గత పది సంవత్సరాల నుండి ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్రువర్తన కలిగి ఉండి పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించేందుకు కూడా అవకాశం ఉందని సీపీ అన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కష్ణ, గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఢిల్లీ కార్యాలయానికి తరలిన మాదిగశక్తి నేతలు

నవతెలంగాణ-పెద్దపల్లి

పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ పునరాలోచన చేయాలని, మాదిగకే పార్లమెంట్ టిక్కెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీ కార్యాలయానికి మాదిగ శక్తి నేతలు తరలివెళ్లారు. ఈ సందర్బంగా మాదిగ శక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్ని మాట్లాడుతూ..మాదిగ దండోరా, మాదిగ జేఏసీ, మాదిగ శక్తి ఆధ్వర్యంలో జిల్లా నుంచి రెండువందల మంది నాయకులు, మహిళలు తరలివెళ్లినట్లు తెలిపారు. రాష్ట్రంలో 80 లక్షల జనాభా కలిగిన మాదిగలను కాంగ్రెస్ విస్మరిస్తూ కేవలం ఒకే కుటుంబానికి చెందిన వారికి రాజకీయంగా అవకాశాలు ఇవ్వడమంటే యావత్తు మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా మాదిగలు కాంగ్రెస్‌కి అండగా ఉంటూ వచ్చారని, అలాంటి మాదిగలను రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నారని అన్నారు. తాడో పేడో తేల్చుకోవడానికి ఢిల్లీకి బయలుదేరామని, ఏఐసీసీ కార్యాలయం ఎదుట మా గొంతును వినిపిస్తామన్నారు. తప్పకుండా అభ్యర్థిని మార్చే వరకు మా పోరాటం ఆగదని బొంకూరి సురేందర్ సన్ని స్పష్టం చేశారు.

అంజన్న హుండీ లెక్కింపు

నవతెలంగాణ-మల్యాల

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం చేపట్టినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు. శ్రీరాజరాజేశ్వరీ సేవా సమితి వారితో 12 హుండీలు 48 రోజులకు గాను విప్పి లెక్కించగా హుండీ ఆదాయం రూ.1,11,07,329లు వచ్చినట్లు తెలిపారు. మిశ్రమ బంగారం 74 గ్రాములు, మిశ్రమ వెండి 5కిలోల 500 గ్రాములు, విదేశీ కరెన్సీ 40 నోట్లు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ దేవాదాయ శాఖ వరంగల్ పరిశీలకులు సంజీవరెడ్డి, ఏఈఓ అంజయ్య, సూపరి ంటెండెంట్స్ శ్రీనివాస్ శర్మ, సునీల్ కుమార్, ఆలయ సిబ్బంది, ఏఎస్ఐలు శ్రీనివాస్, రమణ రెడ్డి, హోంగార్డులు పాల్గొన్నారు.

రూ.51 వేలు నగదు పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని టోల్‌ప్రాజా వద్ద సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.51 వేలు పట్టుకున్నట్టు ఎస్ఐ సాగర్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రాజేష్‌షావు తన కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా నగదును పట్టుకున్నట్టు వివరించారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు తెలిపారు. తనిఖీలో డీసీఆర్‌బీ సీఐ రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.